క్లుప్తంగా

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

ప్రకాశం నగర్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా సాకర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఫుట్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి, కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా పరిశోధకులు సుంకర నాగేంద్ర కిషోర్, సీరా గంగధార్ పాల్గొన్నారు.

23న డాక్, పెన్షన్ అదాలత్‌లు

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో 23వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల వరకు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి డాక్ అదాలత్, పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. తపాలా శాఖకు సంబంధించిన రిజిస్టర్డ్ పోస్ట్, పార్సిల్, మనీ ఆర్డర్, తపాలా పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా తదితర సేవలకు సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించడానికి డాక్ అదాలత్, పోస్టాఫీసు ద్వారా పింఛను తీసుకునే పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులకు సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు 16వ తేదీలోపు రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ కార్యాలయానికి పోస్ట్ ద్వారా పంపాలన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ర్యాలీ



వేసవి శిక్షణ శిబిరం ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో గ్రంథాలయాధికారిణి శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో 30వ రోజు విజయవంతంగా పూర్తిచేసినందుకు ర్యాలీ నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ 30 రోజులు విద్యార్థులు చదివిన కథలపై ఉపాధ్యాయులు బుజ్జి బాబు పోటీలు నిర్వహించారు ముందుగా వందేమాతర గీతం ఆలపించి గ్రంథాలయంలో వున్న పుస్తకాలు చదివి పుస్తక సమీక్షలు చేయించారు. పేపరుమిల్లు ఉద్యోగి భాస్కర రావు విద్యార్థులతో అక్బర్ బీర్బల్ అనే కథను చదివించారు. రిసోర్స్ పర్సన్ దుర్గయ్య విద్యార్థులతో వారు చదివిన కథలను చెప్పించి, విద్యార్థులకు పరమానందయ్య గారి శిష్యుల కథలో సన్నివేశాలు చెప్పి అలరించారు.108 సిబ్బంది కె.నారాయణ విద్యార్థులకు క్రాఫ్ట్‌లో మెళకువలు నేర్పించారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

బిక్కవోలు: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు మంగళవారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన షేక్ గౌసియాకు కొంతమూరు గ్రామానికి చెందిన షేక్ షాకీర్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కట్నంగా రూ.85 వేలు, అరకాసు బంగారం ఇచ్చారు. అయితే తన భర్త రోజూ తాగొచ్చి కొడుతూ, అదనపు కట్నం కావాలని వేధిస్తున్నాడని గౌసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం జేష్ఠ మాసం తదియ పురస్కరించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

అర్హులైన కౌలు రైతులకు సాగు హక్కుపత్రం

పెదపూడి: అర్హులైన కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. పెదపూడిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రం ద్వారా వాస్తవ సాగుదారునికి ఈ-పంట నమోదు, పంట నష్ట పరిహారం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ, కనీస మద్దతు ధర, ధాన్యం కొనుగోలు వంటి పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. మండలంలో 10 వేల కార్డులు జారీ లక్ష్యం కాగా ప్రస్తుతానికి 1000 కార్డులు జారీ చేశామన్నారు. ఈ ప్రక్రియ మరో నెల పాటు కొనసాగుతుందని, అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుర్రుమంటున్న సూరీడు

- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- పగలు తీవ్రమైన ఎండలతో సెగలు
- ఉక్కపోత, వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తప్పనిసరి



ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న బొమ్మూరు -రాజవోలు రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: భానుడు భగభగమంటున్నాడు. పగటిపూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కుతున్నాడు. గత నాలుగురోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. పదిరోజులుగా జిల్లాలో పగటిపూట వేసవితాపం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. ఈ వారం రాజమహేంద్రవరంలో అత్యధికంగా 44.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచే రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవితాపాన్ని తట్టుకోలేక ప్రజలు విలవిలాలాడిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయాన్నే సూర్యభగవానుడు ప్రతాపం చూపించడంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో దుకాణాలు పూర్తిస్థాయిలో మూసివేస్తున్నారు. సాయంత్రం ఐదుగంటలకే మళ్లీ తెరుస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

గరిష్ట ఉష్ణోగ్రత 45డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఉదయం పదింటికే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తాటిముంజెలు, ఓఆర్ఎస్, ఇతరత్రా పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెబుతున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించడం, ఉప్పు, నీరు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం తప్పనిసరి. రోజుకు కనీసం 7 నుంచి 8 లీటర్ల నీళ్లు తీసుకుంటే వడదెబ్బ బారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్తులు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

హీట్ మీటర్ (డిగ్రీలలో)

తేదీ	అత్యల్పం	అత్యధికం
02.06.23	28.5	44
03.06.23	30.00	43.5
04.06.23	29.50	42
05.06.23	25.50	42
06.06.23	28.00	44.5



ఉదయాన్నే ముంజెలు కొనుగోలు చేస్తున్న జనం

లంచాలకు తావు లేకుండా సంక్షేమం



కాతేరులో సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న చందన

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన
- కాతేరులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్: లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం కాతేరు గ్రామ సచివాలయం-4 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదప్రజల అభ్యున్నతి కోసం వినూత్నమైన సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల సారథిగా సీఎం ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లంచాలకు, వివక్షకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు చందనకు విన్నవించిన తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వివిధ కారణాల వలన సంక్షేమ పథకాలు అందనివారి వివరాలను వలంటీర్లు తన దృష్టికి తీసుకురావాలన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, సొసైటీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్, సచివాలయ కన్వీనర్లు మద్దా దుర్గారావు, పొర్ల సురేంద్ర, గంగిపాముల సురేష్, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, నక్కా ధనరాజు, దేవమాత, కప్పల సూర్యకుమారి, రాజేశ్వరి, గృహ సారథులు, వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీనియర్ల సేవలు స్ఫూర్తిగా తీసుకోవాలి

బీజేపీ నగర కన్వీనర్ రంగబాబు



సీనియర్ నాయకులను సత్కరించిన బీజేపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ సీనియర్ నాయకుల సేవలను నేటి తరం నాయకులు గుర్తించి స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ నగర కన్వీనర్ యెనుమల రంగబాబు పేర్కొన్నారు. మంగళవారం నగర బీజేపీ కార్యాలయంలో నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాల సుపరిపాలన విజయాల ప్రచార కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించి సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు రామానుజందాస్ బంగ్, కంటిపూడి సర్వరాయుడు, లక్ష్మీనారాయణ జవ్వార్, హీరాచంద్ జైన్, పైలా సుబ్బారావు, గులుపల్లి ఏసు వెంకటరమణ, గేదెల అప్పారావులను సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, తరేట్ల చింతాలమ్మ, ఉన్ని కృష్ణన్, బూరా రామచంద్రరావు, కురగంటి సతీష్, కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా...



కలెక్టర్ మాధవీలతకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సౌభాగ్యలక్ష్మి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని పూర్తి స్థాయి బోధనావైద్యాసుపత్రిగా జాతీయ మెడికల్ కమిషన్ గుర్తించిన నేపథ్యంలో మరింత బాధ్యతగా పనిచేయాల్సి ఉందని కలెక్టర్ మాధవీలత అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జీజీహెచ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జీజీహెచ్ వైద్య కళాశాలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించడంపై అభినందనలు తెలిపారు. నూతనంగా జిల్లా ఏర్పాటు చేసిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాల ఏర్పాటు కృషి చేసి, ఏడాది వ్యవధిలో సాకారం చేశారన్నారు. ఈ ఏడాది 150 మంది వైద్య విద్యార్థులతో తరగతులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి వివరించారు.

గ్రామాల దత్తత అభినందనీయం

కలెక్టర్ డాక్టర్ మాధవీలత



జెండా ఊపి చెత్త సేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

ధవళేశ్వరం: కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు హిందూస్తాన్ యూనీలివర్ యాజమాన్యం సీఎస్ఆర్ ద్వారా గ్రామాలను దత్తత తీసుకోవడం అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మంగళవారం ధవళేశ్వరం రెవెన్యూ కాలనీలో హిందూస్తాన్ యూనీలివర్ (హార్లిక్స్ ఫ్యాక్టరీ) సీఎస్ఆర్‌లో భాగంగా చేపట్టిన ప్రభాత్ వ్యర్థ పదార్థాల నిర్వహణ, పోషణ్ సాథి కార్యక్రమాలను కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ధవళేశ్వరం, రాజవోలు గ్రామాలను దత్తత తీసుకొని వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమాలను చేపట్టి అమలు చేయడం ప్రోత్సహించ తగ్గ విషయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పెద్ద ఎత్తున సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలు, పరిశ్రమల భాగస్వామ్యం ఉంటే మరింత సాధ్యమవుతుందన్నారు. హిందూస్తాన్ యూనీలివర్, యాజమాన్యం గ్రామాలను దత్తత తీసుకుని కాలుష్యరహిత గ్రామాలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి చెత్తసేకరణ చేసేందుకు ఏడు నూతన వాహనాలు ప్రారంభించామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనత గల గర్భిణులు, బాలింతలు, చిన్నారులను గుర్తించి వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున వైఎస్ఆర్ సంపూర్ణ పోషక పదార్థాలను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లోని పోషక లోపంతో ఉన్న పిల్లలకు ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంపూర్ణ పోషకాహారంతో పాటు ప్రజల సహకారంతో కూడా వారికి మరింత పౌష్టికాహారం అందించే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ప్రభాత్ పోషణ్ సాథి కార్యక్రమాల ద్వారా మహిళలు ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం, వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత చెత్త సేకరణ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. హిందూస్థాన్ యూనీలివర్, సీఎస్ఆర్ భాగస్వామ్యంతో ప్రజారోగ్య పరిరక్షణకు తమ వంతు సహకారంగా కొవ్వూరు, కడియం, రాజమండ్రి రూరల్, సీతానగరం మండలంలోని 53 గ్రామాల్లో గల 107 సచివాలయాల పరిధిలో గల 4.5 లక్షల ప్రజలకు ఆరోగ్య సమతుల్యత కార్యక్రమాలపై అవగాహన నిర్వహిస్తామని ప్రభాత్ సీఎస్ఆర్ ప్రతినిధి మంధీరానగ్రాత్ పేర్కొన్నారు. డీఎల్పీవో సత్యనారాయణ, మ్యాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్ శేషుకుమార్, ఫ్యాక్టరీ హెచ్ఆర్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి పాల్గొన్నారు.

కేసు నమోదు

సీతానగరం: మోటారు సైకిల్‌తో సుంకర సాయిరామ్ అనే వ్యక్తి తన భర్త బోకరి సూర్య నారాయణ (65)ను ఢీకొట్టడంతో మరణించాడని మృతుని భార్య రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. రఘుదేవపురం రవీంద్రకాలనీకి చెందిన సూర్యనారాయణ కూలి డబ్బుల కోసం వెళుతుండగా పెట్రోల్ బంక్ వద్ద మోటారు సైకిల్ ఢీకొనడంతో మరణించాడని పేర్కొన్నట్టు చెప్పారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రంగంపేట సామాజిక తనిఖీ ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాంగోపాల్

రంగంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు(డ్వామా పీడీ) జీఎస్ రాంగోపాల్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగంపేట మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల వివరాలను, ఖర్చులను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1619 పనులకు గాను రూ.10,36,10,698 వేతన ఖర్చు అయ్యిందన్నారు. మెటీరియల్ నిమిత్తం రూ.41,07,208 ఖర్చు చేశారన్నారు. పలు పనుల కొలతల్లో తేడా వచ్చినందుకు ఆయా సిబ్బందిపై రూ.8,000లు జరిమానా విధించి సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు సంబంధించి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, పీఆర్ ఏఈ సీహెచ్ రాము, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మధురపూడి/ సీతానగరం: అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అర్హత కల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరుకొండ సీడీపీఓ జె.జాన్సీరాణీ తెలిపారు. ఆమె మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కోరుకొండ మండలం గాదాల-1, 5, మధురపూడి-1; పశ్చిమగానుగూడెం-2 కేంద్రాలకు, సీతానగరం మండలం కాటవరం-1, చినకొండేపేడి-1, రామచంద్రపురం-1 కేంద్రాలకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులయిన వారు మాత్రమే అర్హులన్నారు. 01-07-23 తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు లోపు వయస్సున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థినులు వివాహిత అయి ఉండాలని, వీఆర్వో, లేదా పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని జత పర్చాలన్నారు. దరఖాస్తుదారులకు సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థినులు దరఖాస్తులను కోరుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందించి, రశీదులు తీసుకోవాలన్నారు. వివరాలకు సీడీపీఓ కార్యాలయం 0883 2496613 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసే విధంగా ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రాజానగరం మండలంలో 2 అంగన్‌వాడీ కార్యకర్తలు (రాజానగరం-1 బీసీ-బి, పాలచర్ల-2 ఎస్టీ), 2 అంగన్‌వాడీ సహాయకులు (లాలాచెరువు-3 జనరల్, చక్రద్వారబంధం -1 ఎస్సీ), రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 2 అంగన్‌వాడీ సహాయకులు (పిడింగొయ్యి -3 ఓసీ, ధవళేశ్వరం -5 బీసీఏ) పోస్టులు ఖాళీలున్నాయి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

హెల్పర్ పోస్టుకు..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు బిక్కవోలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో 30వ రోజు వేసవి శిక్షణ శిబిరం లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు సతీష్‌బాబు, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు సరస్వతీ నమస్తుభ్యం గేయం, వందేమాతరం గీతం ఆలపించారు. గాలిమేడలు అనే బాలల కథను హాజరైన విద్యార్థులతో చదివించి, ప్రశ్నలు వేసి జవాబులు చెప్పించారు. పుస్తక సమీక్ష, వినోదం, చిత్రలేఖనం, ఇంగ్లిష్, తెలుగు వ్యాకరణల వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు.

ఈ తప్పే... భావితరాలకు పెను ముప్పే

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం



అనపర్తిలో చెత్తకుప్పపై ప్లాస్టిక్ వ్యర్థాలు

అనపర్తి: ఉదయం లేచింది మొదలు పాలు, టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సామాన్లు.. ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరుబయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికి డ్రైనేజీలు, పంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం-2011 ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారుచేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలిథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసి పోవాలంటే వందలు, వేల ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీ బ్యాగ్‌లకు జనపనార, క్లాత్, కాగితంతో తయారు చేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.



అనపర్తి కాలువలో తేలియాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతి వినియోగం పర్యావరణానికే కాదు, మానవాళి ఆరోగ్యానికీ హానికరమే. ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తే కాలుష్యాన్ని అధిగమించగలం. దీనిపై ప్రజలు చైతన్య వంతులు కావాలి.

– డాక్టర్ తాడి రామగురెడ్డి, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం, అనపర్తి

సహజ గుణాన్ని కోల్పోతున్న భూమి



పర్యావరణ కాలుష్యంతో భూమి నానాటికి సహజ గుణాన్ని కోల్పోతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకెళితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించొచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి.

– ఎం.దుర్గాప్రసాద్, సామాజిక కార్యకర్త, అనపర్తి

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనూష కోరారు. స్థానిక సచివాలయం-2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు, గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలో స్థానిక సబ్ సెంటర్ వద్ద నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.నాగ శ్రీవిద్య పాల్గొని పలువురు రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం జ్యోతి, హెచ్‌వీ బి.శ్రీదేవి, ఎంపీహెచ్ఎస్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.